ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 331 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 11 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# మూడేళ్లలో పంచాయతీలకు శాశ్వత భవనాలు

### ప్రతిపాదనలు సిద్ధం చేయండి ... పీఆర్ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి సూచన

**హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్: వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలో శాశ్వత భవనాల్లేని గ్రామపంచాయతీల భవనాలు నిర్మించే దిశలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సూచించారు. స్థలాలు అందుబాటులో ఉన్నచోట తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు కలిపి నిర్మించే అవకాశాలు పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని, అవసరమైన పౌష్టికాహారంతో పాటు బోధనా పద్ధతులతో తర్ఫీదు ఇవ్వాలన్నారు. పట్టణాల్లో రోడ్లపై కొందరు చంటి బిడ్డలతో యాచక వృత్తి కొనసాగిస్తున్నారని, వారందరినీ శిశు విహార్‌లో చేర్చుకుని అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లపై చంటి బిడ్డలు పట్టపగలు ఎండకు, వర్షాకాలంలో వానకు తడిసి వారి విలువైన బాల్యం మసకబారకుండా చూడాలన్నారు. శిశు విహార్లలో ఆధునిక వంట గదిని నిర్మించాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో 2026--27 బడ్జెట్ ప్రతిపాదనలపై

..మిగతా 2లో






# రాష్ట్రానికి కొత్త గవర్నర్

### స్వాగతం పలికిన సీఎం రేవంత్, మంత్రులు

**హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణకు కొత్తగా నియమితులైన నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్ చేరుకున్నారు. ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సిఎం రేవంత్ తదితరులున గవర్నర్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు గవర్నర్‌కు స్వాగతం పలికి వారిలో ఉన్నారు. అనంతరం గవర్నర్ నేరుగా లోక్ భవన్ చేరుకున్నారు.




# కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం

### అసెంబ్లీ సమావేశాల్లో ప్రైవేట్ మెంబర్ బిల్లు
### ఢిల్లీకి డబ్బులు పంపడమే మూసి ప్రాజెక్ట్ లక్ష్యం
### బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎమ్మెల్యేల సమావేశంలో కేటీఆర్

**హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఆరు గ్యారెంటీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేస్తున్న తీరును ఎండగట్టేందుకు ఆరు గ్యారెంటీలకు ఇచ్చిన మాట ప్రకారం చట్టబద్ధత కల్పించేందుకు ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భారత రాష్ట్ర సమితి తరపున ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

..మిగతా 2లో





# తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'

## 208 మంది అరెస్ట్!

### తెలంగాణలో 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో పోలీసుల మెరుపు దాడులు
### రాష్ట్రవ్యాప్తంగా 208 మందిని అరెస్ట్ చేసిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో
### నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, విద్యార్థులు
### రూ.100 కోట్ల విలువైన మోసాలకు మ్యూల్ ఖాతాలు వాడినట్లు గుర్తింపు
### కమీషన్ కోసం తమ ఖాతాలను సైబర్ మోసగాళ్లకు అప్పగించినట్లు వెల్లడి

**హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో సైబర్ మోసగాళ్లకు సహకరిస్తున్న వారిపై రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఉక్కుపాదం మోపింది. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్ 1.0' పేరుతో ఫిబ్రవరి 25న ప్రారంభించిన ఈ రాష్ట్రవ్యాప్త ఆపరేషన్‌లో భాగంగా 208

..మిగతా 2లో

# తెలుగు రాష్ట్రాలపై యుద్ధ ప్రభావం..

### వాణిజ్య సిలిండర్ల తీవ్ర కొరత
### రాష్ట్రవ్యాప్తంగా హోటళ్ల బంద్ నిర్వహించే యోచన..
### తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అత్యవసర సమావేశం
### బెంగళూరు, ముంబై, ఢిల్లీలలో పలు హోటళ్లు తాత్కాలికంగా మూత




**హైదరాబాద్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

గ్యాస్ కొరత తెలుగు రాష్ట్రాలలోని హోటల్ పరిశ్రమపై కూడా పడింది. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీలలో పలు హోటళ్లు తాత్కాలికంగా మూతబడిన విషయం తెలిసిందే. వాణిజ్య గ్యాస్ సిలిండర్ కొరత ప్రభావం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలోని హోటళ్లపై కూడా పడింది. హోటళ్లకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిపివేయాలని డీలర్లను పెట్రోలియం కంపెనీలు ఆదేశించాయి. దీనితో..

..మిగతా 2లో

# పుతిన్‌తో ట్రంప్ చర్చలు



### అణు పరీక్షలు ఆపకపోతే మొజ్తబాను టార్గెట్ చేస్తామన్న ట్రంప్

**వాషింగ్టన్ మార్చి 10 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడారు. వారిద్దరూ దాదాపు గంటసేపు ఫోన్‌లో కీలక అంశాలపై చర్చించారు. అమెరికా–ఇజ్రాయెల్–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధాన్ని త్వరగా ముగించేందుకు పుతిన్ కొన్ని ప్రతిపాదనలు చేసినట్లు క్రెమ్లిన్ వెల్లడించింది. వాషింగ్టన్ చొరవతో జరిగిన ఈ చర్చల్లో యుద్ధాన్ని దౌత్యమార్గాల ద్వారా పరిష్కరించుకోటంపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నట్లు తెలిపింది. ఉక్రెయిన్ యుద్ధం, వెనెజువెలా అంశాలు కూడా ఈ సందర్భంగా ప్రస్తావనకు వచ్చినట్లు క్రెమ్లిన్ తెలిపింది. ఈ చర్చలు యుద్ధ వాతావరణాన్ని తగ్గించేందుకు ఉపయోగపడతాయని భావిస్తున్నట్లు రష్యా తెలిపింది. మరోవైపు ఇరాన్‌పై యుద్ధం చాలా వరకు పూర్తైందని, గతంలో అంచనా

..మిగతా 2లో

# కాంగ్రెస్ మోసాన్ని ఎండగడతాం

మొదటి పేజీ తరువాయి...

తెలిపారు. మంగళవారం గోల్కొండ రిసార్ట్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఉమ్మడి ఓరియంటేషన్ సమావేశం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ అధికారంలోకి రాగానే తొలి క్యాబినెట్ సమావేశంలోనే 6 గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఆ హామీని, ఆ మాటను మరిచిపోయిందని అన్నారు. అందుకే ఆరు గ్యారెంటీల ద్వారా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఈ బిల్లు ద్వారా ఎండ గడతామన్నారు.

**కాంగ్రెస్ పార్టీ మోసాన్ని ఎండగడతాం.**

రాహుల్ గాంధీతో సహా ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ మోసాన్ని కూడా ఈ బిల్లు ద్వారా శాసనసభలో ఎండగడతామన్నారు. కాంగ్రెస్ పార్టీ సభ్యులు కూడా ఈ బిల్లుకు మద్దతు ఇచ్చి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలు, వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టేందుకు ఈ బడ్జెట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం పైన మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అరాచకాల పైన ఈ అసెంబ్లీ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం పైన చర్చించామని కేటీఆర్ తెలిపారు. మా పార్టీ సీనియర్ నేతలు మధుసూదనాచారి, బండ ప్రకాష్, తలసాని శ్రీనివాస్ యాదవ్, సబితా రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటినా అసెంబ్లీలో



ఏ కమిటీలను వేయడం లేదు. పబ్లిక్ అకౌంట్స్ కమిటీని మా పార్టీ నుంచి ద్రోహం చేసి పోయిన వ్యక్తికి ఇచ్చారు. ఒక్క సెలెక్ట్ కమిటీ లేదు, స్టాండింగ్ కమిటీ లేదు, పిటిషన్స్ కమిటీ లేదు. ఇలా డిప్యూటీ స్పీకర్ కూడా శాసనసభలో లేరు. కేవలం అనివార్యంగా శాసనసభ సమావేశాలను నడిపించాల్సి వస్తుంది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో కాంగ్రెస్ బుల్డోజర్లను పంపి ఇళ్లను కూలగొడుతున్న తీరుగానే శాసనసభలోనూ మంద బలంతో బుల్డోజర్ టాక్టిక్స్ ని ప్రయోగిస్తున్నది. శాసనసభ, శాసనమండలి సమావేశాల్లో అబద్ధాలను, అసత్యాలను పచ్చిగా మాట్లాడుతూ అంకెలను తారుమారు చేస్తూ శాసనసభ సమావేశాలను తూతూమంత్రంగా నిర్వహిస్తున్నదన్నారు కేటీఆర్. ఆరు గ్యారెంటీలకు మొదటి క్యాబినెట్ సమావేశంలోనే నిర్ణయం తీసుకొని చట్టబద్ధత కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. కానీ రెండున్నర సంవత్సరాల తర్వాత కూడా చట్టబద్ధత పక్కన పెట్టి కనీసం అమలు కూడా చేయడం లేదు. అందుకే ఈ సమావేశాల్లో ఒక ప్రైవేట్ మెంబర్ బిల్లును మా పార్టీ తరపున తీసుకురావడానికి ప్రయత్నం చేస్తాం. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్‌ను జీరో వ్యాల్యూ చేయడం కాదు, అసలు జీరో వ్యాల్యూ ఎవరికైనా ఉన్నది అంటే అది రేవంత్ రెడ్డికే. రేవంత్ రెడ్డి మాటలకు ముమ్మాటికీ జీరో విలువ ఉన్నది. రేవంత్ రెడ్డి ఏం చేస్తున్నాడో ఆయనకే తెలియదు, తాను తీసుకున్న నిర్ణయాలు కూడా తనకే తెలియదని చెప్తున్నాడు.

దే ఎకానమీని నాశనం చేసిన వ్యక్తి నైట్ ఎకానమీ గురించి మాట్లాడుతున్నాడు.

రేవంత్ రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా రాహుల్ బంధు పథకాన్ని పక్కన పెట్టి రైతు బంధు కార్యక్రమాన్ని చేపట్టాలి. రెండున్నర సంవత్సరాలలో ఒక్క ఇల్లు అయినా కాంగ్రెస్ పార్టీ కట్టింది అంటే నేను రాజీనామా చేస్తానని చెప్పాను, దానికి నేను ఇంకా కట్టుబడి ఉన్నాను

## ప్రపంచ కప్ విజేతలకు

# బీసీసీఐ భారీ నజరానా..

### రూ.131 కోట్ల ప్రైజ్‌మనీ

**న్యూఢిల్లీ, మార్చి 10 (విశాల తెలంగాణ):**

టీ20 వరల్డ్ కప్ 2026 ట్రోఫీ గెలిచిన భారత జట్టుకు బీసీసీఐ భారీ నజరానా ప్రకటించింది. గత రికార్డులను తిరగరాస్తూ ఏకంగా రూ.131 కోట్ల ప్రైజ్‌మనీ ప్రకటించింది. ఇది ఇప్పటివరకు వరల్డ్ కప్ విజేతలైన భారత జట్టుకు ఇచ్చిన అత్యధిక నజరానా. ఈ విషయాన్ని బీసీసీఐ సెక్రెటరీ దేవ్‌జిత్ సైకియా మంగళవారం వెల్లడించారు. గతంలో 2024లో రోహిత్ శర్మ నాయకత్వంలో భారత జట్టు టీ20 వరల్డ్ కప్ గెలిచిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ అందించగా, ఇప్పుడు అంతకంటే ఎక్కువగా బహుమతి ప్రకటించింది బీసీసీఐ. రూ.6 కోట్లు పెంచి రూ.131 కోట్లను బహుమతిగా ఇవ్వనుంది. ఇక టోర్నీలో విజేతగా నిలిచిన జట్టుకు అందించే ప్రైజ్‌మనీగా ఇండియాకు ఐసీసీ నుంచి రూ.27.48 కోట్లు దక్కిన సంగతి తెలిసిందే. రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టుకు రూ.14.65 కోట్లు అందాయి. బీసీసీఐ ప్రకటించిన రూ.131 కోట్లను జట్టులోని 15 మంది సభ్యులకు అందజేస్తారు. అలాగే కోచింగ్ స్టాఫ్, ఇతర సపోర్టింగ్ స్టాఫ్‌కు కూడా ఇందులో వాటా ఉంటుంది. ఈ




నగదు బహుమతికి సంబంధించిన బ్రేక్‌డౌన్‌ను బీసీసీఐ అధికారికంగా వెల్లడించదు. కానీ, అత్యధిక అమౌంట్ ఆటగాళ్లకు సమంగా అందుతుంది. ఆ తర్వాత కోచింగ్ స్టాఫ్‌కు దక్కుతుంది. చివరగా సపోర్టింగ్ స్టాఫ్‌కు అందజేస్తారు. వీరికి ఎంత ఇవ్వాలి అనేది బీసీసీఐ పెద్దలు నిర్ణయిస్తారు. ఇక కెప్టెన్ సూర్య కుమార్‌కు అందరికంటే ఎక్కువగా భారీగా ప్రోత్సాహం అందుతుంది. ఆదివారం జరిగిన టీ20 వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచులో న్యూజిలాండ్‌పై ఇండియా భారీ విజయం సాధించింది. అందులోనూ సొంతగడ్డపై ఇలా తొలిసారి టోర్నీ గెలిచింది. దీంతో దేశవ్యాప్తంగా జట్టుపై ప్రశంసల వర్షం కురుస్తోంది.

# ఇండిగో సీఈవో రాజీనామా..

## ఎండీకి అదనపు బాధ్యతలు అప్పగింత..!

**న్యూఢిల్లీ, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బెర్స్ రాజీనామా చేశారు. నిరుడు డిసెంబర్‌లో ఇండిగో చరిత్రలోనే తీవ్రమైన సంక్షోభం సమయంలో విమర్శల పాలైన ఆయన ఎట్టకేలకు సీఈఓ బాధ్యతల నుంచి మంగళవారం వైదొలిగారు. పీటర్ తప్పుకున్నందున తదుపరి సీఈవో ఎవరు? అనే ప్రశ్న ఎదురవ్వకుండా చూసుకుంది యాజమాన్యం. ఇండిగో సంక్షోభం సమయంలో తీవ్ర విమర్శల పాలైన సీఈవో పీటర్ అల్బెర్స్ మూడు నెలల తర్వాత రాజీనామా చేశారు. ఇప్పటికిప్పుడు కొత్తవారిని నియమించకుండా.. తాత్కాలిక సీఈవోగా రాహుల్ భాటియా కొనసాగుతారని ఇండిగో తెలిపింది. ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్న భాటియా కొన్ని రోజులు తమ కంపెనీ వ్యవహారాలను చూసుకుంటారని సంస్థ పేర్కొంది.

**2,507 విమానాలను రద్దు**

నిరుడు డిసెంబర్ ప్రారంభంలో ఇండిగో సంస్థ తీవ్రమైన సంక్షోభాన్ని చవిచూసింది. విమాన విధుల సమయ పరిమితి(ఎఫ్‌డీటీఎల్) ఆచరణలో సంస్థ సన్నద్ధతలోపంతోనే సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. డిసెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకూ.. మూడు రోజుల వ్యవధిలోనే 2,507 విమానాలను రద్దు చేశారు. ఫలితంగా పలు విమానాశ్రయాల్లో 3 లక్షలకు మందికిపైగా ప్రయాణికులు పడిగాపులు కాస్తూ తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. ఇండిగో సంక్షోభంపై కేంద్రప్రభుత్వం అత్యున్నత స్థాయి విచారణకు ఆదేశించింది. సీఈఓగా పీటర్ ఎల్బెర్స్ విఫలమయ్యారని మీడియా కథనాలు ఆయనపై దుమ్మెత్తిపోశాయి. దాంతో.. ఆయన వీడియో మెసేజ్‌తో ప్రయాణికులకు క్షమాపణలు తెలిపారు.



'కొన్ని రోజులుగా విమాన సర్వీస్‌ల విషయంలో అంతరాయాలు చూస్తున్నాం. అప్పటి నుంచి ఈ పరిస్థితి మరింత జఠిలంగా మారింది. డిసెంబర్ 5, శుక్రవారం మాత్రం సర్వీస్‌లపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఒక్కరోజే 1000కి పైగా విమానాలను రద్దు చేశాం. ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందుకు నా తరఫున, మా సంస్థ ఇండిగో తరఫున మీఅందరికీ క్షమాపణలు తెలియజేస్తున్నా. సర్వీస్‌లు ఆలస్యంగా నడవడం, పలు విమానాలు రద్దు కావడంతో చాలామంది కష్టాలు పడుతున్నారు. ఇండిగోలో సాధారణ పరిస్థితులు నెలకొనడానికి కనీసం పది రోజులు పట్టేలా ఉంది. డిసెంబర్ 10-15 వరకూ సర్వీస్‌లు యథావిధిగా నడిచే అవకాశముంది' అని పీటర్స్ పేర్కొన్నారు. ఇండిగో సంక్షోభంపై భగ్గుమన్న డీజీసీఏ.. సంస్థ షెడ్యూల్‌పై కోత విధించింది. ఫిబ్రవరి 10 నాటికి 10 శాతం సర్వీస్‌లకే అనుమతిచ్చింది. అంతేకాదు జనవరి 17న ఇండిగోపై రూ.22 కోట్ల జరిమానా వేసింది. అలానే అప్పటి సీఈవో పీటర్ సహా ఇద్దరు సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారులను డీజీసీఏ హెచ్చరించింది.



## తెలుగు రాష్ట్రాలపై

# యుద్ధ ప్రభావం

మొదటి పేజీ తరువాయి...

హోటల్, రెస్టారెంట్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిపివేయడంతో తమ వ్యాపారానికి గండిపడిందని తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయాలు చూపించకపోతే రాష్ట్రవ్యాప్తంగా హోటళ్ల బంద్ నిర్వహించే యోచనలో ఉన్నట్లు తెలిపారు. సికింద్రాబాద్‌లో తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. గ్యాస్ కొరతతో వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత తీవ్రంగా ఉందని విశాఖ హోటల్ మర్చంట్ సంఘం అధ్యక్షుడు బాలకృష్ణ తెలిపారు. సిలిండర్ల సరఫరా రేపటి నుంచి మరింత తగ్గవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఇప్పటి వరకు బ్లాక్ మార్కెట్ నడుస్తోందని, పరిస్థితి ఇలాగే ఉంటే నిర్వహణ కష్టంగా మారుతుందని అన్నారు. వాణిజ్య సిలిండర్ల కొరతపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. గ్యాస్ కొరత లేకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చూడాలని కోరారు.

## మూడేళ్లలో పంచాయతీలకు

# శాశ్వత భవనాలు

మొదటి పేజీ తరువాయి...

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ప్రీ--బడ్జెట్ సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మహిళలు, చిన్నారుల సంక్షేమానికి ఈ శాఖలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉపాధి హామీకి కేంద్ర ప్రభుత్వం కోతలు విధిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆ లోటును భర్తీ చేసే దిశగా చర్య లు తీసుకుంటుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉండేలా రాష్ట్రం నుంచి అవసరమైన నిధు లు కేటాయించి పథకం అమలు కొన సాగించేందుకు చర్యలు తీసుకుంటామని భట్టి విక్ర మార్క, సీతక్క వెల్లడించారు. ఏజెన్సీలో ఇసుక మైనింగ్ ట్రైబల్ ఏజెన్సీల ద్వారా మాత్రమే జరగాలని భట్టి స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్‌శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సీసీఎల్ఏ సెక్రటరీ లోకేశ్ కుమార్, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, పీఆర్ కమిషనర్ దివ్య దేవరాజ్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, గృహ నిర్మాణ శాఖ సెక్రటరీ గౌతం, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

## తెలంగాణలో

# 'ఆపరేషన్ క్రాక్‌డౌన్'

మొదటి పేజీ తరువాయి...

మందిని అరెస్ట్ చేసినట్లు టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయల్ మంగళవారం తెలిపారు. నిందితుల్లో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఏడుగురు విద్యార్థులు, 15 మంది మహిళలు, ఇద్దరు లెక్చరర్లు, విద్యుత్ శాఖ ఉద్యోగి కూడా ఉండటం గమనార్హం. దేశవ్యాప్తంగా జరుగుతున్న సైబర్ మోసాలకు సంబంధించిన నగదు బదిలీలకు ఉపయోగించే 'మ్యూల్ ఖాతాల'పై ఈ ఆపరేషన్ కేంద్రీకరించింది. నిందితులు 5 శాతం వరకు కమీషన్ తీసుకుని తమ బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు అప్పగించినట్లు దర్యాప్తులో తేలింది. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ డేటాను విశ్లేషించిన టీజీసీఎస్‌బీ, తెలంగాణలో తెరిచిన అనుమానాస్పద ఖాతాలను గుర్తించింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా 512 మంది సిబ్బందితో కూడిన 137 పోలీస్ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా 137 బ్యాంకు బ్రాంచ్‌లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాయి. దేశవ్యాప్తంగా 9,451 కేసులతో సంబంధం ఉన్న 1,888 మ్యూల్ ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ద్వారా సుమారు రూ.100 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. అరెస్టయిన వారిలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, జూబ్లీహిల్స్ మర్చంట్ కో-ఆపరేటివ్ బ్యాంకులకు చెందిన ఇద్దరు ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరు సరైన కేవైసీ నిబంధనలు పాటించకుండా ఖాతాలు తెరిచేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 మొబైల్ ఫోన్లు, 208 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్ బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్‌లో ఒక వ్యక్తి తన కుటుంబ సభ్యుల ఖాతాలను కూడా మోసాలకు వాడినట్లు తేలింది. కొందరు నిందితులు నకిలీ పత్రాలతో ఆన్‌లైన్‌లో ఖాతాలు తెరిచి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది.

# పుతిన్‌తో ట్రంప్ చర్చలు

మొదటి పేజీ తరువాయి...

వేసిన నాలుగైదు వారాల కన్నా ముందే ముగిసిపోతుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఇరాన్‌కు ఇప్పుడు నేవీ, ఎయిర్‌ఫోర్స్, కమ్యూనికేషన్లు లేవని, వారి క్షిపణులు చెల్లాచెదురుగా పడుతున్నాయని తెలిపారు. ఆసియాకప్‌లో పాల్గొన్న ఇరాన్ మహిళా ఫుట్‌బాల్ జట్టును స్వదేశానికి పంపవద్దని ఆస్ట్రేలియాను కోరారు. వారికి అక్కడే ఆశ్రయం కల్పించాలని సూచించారు. లేకుంటే అమెరికా వారిని చేరదీస్తుందని ట్రంప్ అన్నారు. ఇరాన్ సుప్రీం లీడర్‌గా మొజ్తబా ఖమేనీని ఎంపిక చేయడంపై ట్రంప్ విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో ఇరాన్ పెద్ద తప్పు చేసిందన్నారు. మొజ్తబా ఎంతకాలం పదవిలో కొనసాగుతారో తెలియదని, ఐతే ఆయన ఎంపిక సరైన నిర్ణయం కాదని తాను భావిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. తన మనసులో మొజ్తబా ఖమేనీకి బదులుగా మరొకరు ఉన్నారని వివరించారు. అణు కార్యక్రమాలు, క్షిపణి పరీక్షలు ఆపాలన్న అమెరికా డిమాండ్‌ను అంగీకరించకుంటే మొజ్తబాను లక్ష్యంగా చేసుకోవడానికి వెనుకాడబోమని ట్రంప్ తన సన్నిహితుల్తో అన్నట్లు అమెరికా మీడియా తెలిపింది. మరోవైపు ఇంధన ధరలు నియంత్రించే క్రమంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. కొన్ని రకాల చమురు ఆంక్షలను తొలగించనున్నట్లు వెల్లడించారు. యుద్ధం నేపథ్యంలో ముడి చమురు ధరలు పెరగకుండా, నిరంతర సరఫరా కొనసాగడానికి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ వివరించారు. ఈ సందర్భంగా హర్మూజ్ జలసంధి మీదుగా వెళ్లే చమురు ట్యాంకర్లకు తమ నౌకాదళాలు, భాగస్వాములు కలిసి రక్షణ కల్పిస్తాయని ట్రంప్ పేర్కొన్నారు. సైనిక చర్య చేపడితే చమురు ధరలు పెరుగుతాయని తనకు ముందే తెలుసని, అయితే, ఇరాన్ అణు క్షిపణులు సమకూర్చుకోకూడదనే తాను ఈ చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఇక, చమురు సరఫరాను అడ్డుకునేందుకు ఇరాన్ ప్రయత్నిస్తే దానిపై భీకర దాడి చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.

## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన

# ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక విజయవంతం చేయాలి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి,మార్చి 10**





ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధుల శిక్షణను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారుమంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉ న్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈ నెల 12వ తేదీన ప్రజా ప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల కార్యచరణ రూపొందించడం జరిగిందని, గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్చి 6వ తేదీన మొదలై మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ అమలు చేయడం జరుగుతుందని, ఆరోగ్యం, అరైవ్ అలైవ్, సంక్షేమం, పిల్లలు భద్రత, వ్యవసాయం, విద్య, యువత, మహిళలు, పర్యావరణం తదితర అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 12వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలోని గ్రామపంచాయతీల సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపల్ కార్పొరేటర్లు/కౌన్సిలర్లకు జిల్లా కేంద్రాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలులో వారు నిర్వర్తించవలసిన విధుల పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణలో ప్రజాప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల వివరాలు, అర్హులైన ప్రజలకు అదే విధంగా అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవలసిన చర్యల గురించి తెలియజేయాలని తెలిపారు. 99 రోజుల ప్రణాళిక, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల అనంతరం తెలంగాణ పంచాయతీరాజ్ ఉ మున్సిపల్ యాక్ట్ ల గురించి ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించాలని తెలిపారు. సులభంగా అర్థమయ్యే రీతిలో మాస్టర్ ట్రైనర్ల సహాయంతో ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాప్రతినిధుల శిక్షణ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. అదే విధంగా జిల్లాలో 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందని, పారిశుద్ధ్య ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని, జిల్లాలో త్రాగునీటికి సంబంధించి నెలకొన్న చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కరించడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు దశల వారీగా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమానికి సంబంధించి ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేస్తూ ఎలాంటి ఇబ్బందులు లేకుండా కార్యక్రమాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## సహకరించండి

**బుద్వేల్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల కు చెందిన బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల నూతన కమిటీ సభ్యులు, దళిత నాయకులు మంగళవారం మైలార్దేవుపల్లి లోని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ నివాసంలో ఆయన ను మర్యాదపూర్వకంగా కలిశారు. జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ దాసరి రమేశ్, కో చైర్మన్ నందిగామ నర్సింహ్మా, ప్రధాన కార్యదర్శి మంగలారం శ్రీనివాస్, కోశాధికారి పలుగుచెరువు మహేందర్ లు ఎమ్మెల్యే ను కలసిన వారిలో ఉన్నారు. 2026 ఏప్రిల్ 5న ఆరాంఘర్ బాబు జగ్జీవన్రాం చౌరస్తాలో మాజీ ఉప ప్రధాని దివంగత బాబు జగ్జీవన్ రామ్ జయంతి, ఏప్రిల్ 14న రాజేంద్రనగర్ లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించడానికి ప్రతి సంవత్సరం మాదిరిగానే ప్రభుత్వం నుంచి సహకారం ఇప్పించాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే ను కలసిన వారిలో జయంతి ఉత్సవాల కమిటీ వ్యస్థాపక అధ్యక్షులు పోయిల జీవన్ దాస్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వనం నర్సింహ్మా మాదిగ, పోతురాజు యాదయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పలుగుచెరువు మహేశ్, మాజీ కౌన్సిలర్ కె ఎస్ దయానంద్, దళిత నాయకులు అనుముల జాన్ పాల్, గోల్కొండ రాజ్ కుమార్, పచ్చ అనిత, బాబురావు, ఎడ్లకాడి సూర్యం, పి. మోహన్ రావు శేఖర్, గొడుగు సంజీవ తదితరులు ఉన్నారు.

## నేడు హనుమాన్ నగర్‌కు మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి, కార్తీక్ రెడ్డిల రాక

**రాజేంద్రనగర్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ బస్తీ ప్రజలతో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి. కార్తీక్ రెడ్డి ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారని బీఆర్ఎస్ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. హనుమాన్నగర్ కాలనీ వాసుల బాధలు తెలుసుకుంటారన్నారు.



సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ సర్పంచ్ పెండ్యాల పాండు ను కలిసిన హిందూ సమ్మేళనం ప్రతినిధులు

## ఏప్రిల్ 4న జరిగే హింధు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**బుద్వేల్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ లో ఏప్రిల్ 4న హింధూ సమ్మేళనం నిర్వహించనున్నట్లు ప్రచార కమిటీ సభ్యులు వేముల రామక్రిష్ణ తెలిపారు. రాజేంద్రనగర్ హ రిహర క్షేత్రం ఆవరణలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు తెలియజేశారు. ఏప్రిల్ 4న జరిగే హింధు సమ్మేళనానికి అధ్యక్షులుగా పెండ్యాల రామక్రిష్ణ ను నియమించడం జరిగిం దన్నారు. కార్యనిర్వాహక అధ్యక్షులుగా బ్రాహ్మణపల్లి బాల్ రాజు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సుల్తాన్ అమరేందర్, కోశాధికారి గా వై. చిన్మయానంద స్వామి నియమితులైనారు. ఈ కమిటీ ని మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెండ్యాల పాండు అభినందించారు. ప్రచార కార్యదర్శిగా వేముల రామక్రిష్ణ వ్యవహరించనున్నారు.

## చాంద్రాయణగుట్ట నుంచి దుర్గానగర్ వైపు వచ్చే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలి

**బుద్వేల్, మార్చి 10 (ప్రభాత ఉదయం):**

చాంద్రాయణగుట్ట నుంచి దుర్గానగర్ మీదుగా ఆరాంఘర్ వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను చూసుకోవాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీహెచ్ రాజు తెలిపారు. ఈ మార్గంలో సీసీ రోడ్డు వేస్తున్న నేపథ్యంలో వాహనాల రద్దీగా ఎక్కువగా ఉంటుం దన్నారు. చాంద్రాయణ గుట్ట నుంచి మైలార్దేవుపల్లి, కాటేదాన్ కు వస్తున్న వారు పహడీషరీఫ్ మీదుగా గానీ, ఫలక్నుమా, తాడ్బన్ నుంచి మైలార్దేవుపల్లి కి రావచ్చున్నారు. ఈ విషయాన్ని వాహనదారులు గమనించి సహకరించాలన్నారు.



పల్లె చెరువు వద్ద సీసీ రోడ్డు పనులు

## సరైన అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకుంటాం

**రాజేంద్రనగర్ మండల విద్యాధికారి**

**రాజేంద్రనగర్,మార్చి10(ప్రభాత ఉదయం)**



రాజేంద్రనగర్ మండల పరిధిలో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు సరైన అనుమతులు లేకుండా,తప్పుడు ప్రచారం ద్వారా తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తూ విద్యాసంస్థలను నిర్వహిస్తున్నట్లు విద్యాశాఖ దృష్టికి వచ్చిందని రాజేంద్రనగర్ మండల విద్యాశాఖాధికారి అన్నారు.ఇలాంటి పాఠశాలలను ఉపేక్షించేది లేదని వివరించారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ...రీజొనేన్స్ పాఠశాల శ్రీవిద్య పాఠశాల ఫైన్ ఇస్లామిక్ పాఠశాల ఇన్వెడ్ ఇంటర్నేషనల్ పాఠశాలలు సరైన ప్రభుత్వ అనుమతులు లేకుండా లేదా తప్పుడు సమాచారం ఇచ్చి ప్రవేశాలు తీసుకుంటున్నట్లు గుర్తించబడిందన్నారు.కొన్ని పాఠశాలలు తమ పాఠశాల సీబీఎస్ఈ బోర్డుకు అనుబంధం ఉందని,సీబీఎస్ఈ క్యారీకులం ఉందని తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్నాయని అన్నారు.అయితే రాజేంద్రనగర్ మండలంలో ప్రస్తుతం మాత్రమే 12 సీబీఎస్ఈ అనుమతి పొందిన పాఠశాలలు ఉన్నాయని,మిగిలిన పాఠశాలలు స్టేట్ సిలబస్ ప్రకారం మాత్రమే నడుస్తున్నాయని వివరించారు.అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను పై పేర్కొన్న అనధికారిక పాఠశాలల్లో చేర్చకూడదని కోరారు.పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ అనుమతి పొందిన పాఠశాలలలో మాత్రమే ప్రవేశాలు చేయాలన్నారు.రాజేంద్రనగర్ మండలంలో ఉన్న అధికారిక సీబీఎస్ఈ పాఠశాలల జాబితా ఈ ప్రకటనకు అనుబంధంగా జత చేశారన్నారు.విద్యాశాఖకు సహకరించి,సరైన అనుమతులు లేని పాఠశాలలపై సమాచారం అందించాలని తల్లిదండ్రులు సూచించారు.

## నేడు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

**బుద్వేల్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

ఈ నెల 11న ఉదయం 10 గంటలకు రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ లబ్దిదారులకు చెక్కులను అం దజేయనున్నట్లు తహసీల్దార్ బొమ్మ రాములు ఓ ప్రకటన లో తెలిపారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ చేతుల మీదుగా ఈ చెక్కులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 168 మంది కళ్యాణలక్ష్మీ లబ్దిదారులకు, 674 షాదీ ముబాకర్ లబ్దిదారులకు ఈ సందర్భంగా చెక్కులను అందజేఅంటున్నట్లు తహసిల్దార్ బి రాములు తెలిపారు



బైబిల్ సందేశాలను అందచేస్తున్న రెవరెండ్ డాక్టర్ నిరీక్షన్ కుమార్

## క్రైస్తవ సంఘ కాపరులు ఆత్మానుసారంగా నడుచుకోవాలి

**రెవరెండ్ డాక్టర్ నిరీక్షన్ కుమార్**

**బుద్వేల్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**


క్రైస్తవ సంఘాల కాపరులు ఆత్మానుసారంగా నడుచుకోవాలని, జంటనగరాల పెంతుకోస్తు పాస్టర్ల ఫెలోషిప్ సలహాదారులు రెవరెండ్ డాక్టర్ నిరీక్షన్ కుమార్ అన్నారు. అత్తాపూర్ రాక్ చర్చిలో మంగళవారం ట్విన్ సిటీస్ పెంతుకోస్తు పాస్టర్స్ ఫెలోషిఫ్ మీటింగ్ ఆ సంఘం ప్రధాన కార్యదర్శి రెవరెండ్ ప్రసాద్ చౌదరి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న రెవరెండ్ డాక్టర్ నిరీక్షన్ కుమార్ బైబిల్ సందేశాలను అందజేశారు. సంఘాల కాపరులు వినయ, వివేకంతో నడుచుకోవాలన్నారు. బైబిల్ లో యోసేపు ను చూసినట్లయితే యోసేపు మాటలను రాజైన ఫరో విశ్వసించాడన్నారు. ఈ నాడు క్రైస్తవ సంఘ కాపరులు (పాస్టర్లు) గా సేవ చేస్తున్న వారి మాటలను విశ్వాసులు, ప్రజలు విశ్వసించే వారిగా ఉ ండాలన్నారు. పాస్టర్లు ఆత్మ జ్ఞానం కలిగి ఉండటం మంచిదన్నారు. యోసేపు ఆత్మానుసారంగా నడుచుకున్నాడని, పాస్టర్లు కూడా ఆ మాదిరి జీవితాన్ని జీవించాలన్నారు. ఆత్మానుసారంగా నడుచుకున్నప్పుడు శరీరానుసారంగా ఎలాంటి తప్పులు చేయం అన్నారు. ప్రవచనాలు చెప్పే వారు ఆత్మానుసారంగా చెప్పాలన్నారు. ప్రజలు వస్తున్నారు కదా అని ఏదో ఒకటి చెప్పడం మంచిది కాదన్నారు. ఈ సందర్భంగా బహ్రెయిన్ లో చిక్కుకున్న జంటనగరాల పెంతు కోస్తు పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ పి.దీవెన్ కుమార్ తో పాటు అక్కడున్న వారు క్షేమ ంగా భారత్ కు తిరిగి రావాలని ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెంతుకోస్ట్ పాస్టర్స్

ఫెలోషిప్ (పీపీఎఫ్) ఉపాధ్యక్షులు రెవరెండ్ ఇశ్రాయేల్, రెవరెండ్ డేవిడ్ సుధాకర్, రెవరెండ్ ఐజాక్ గ్యార, కోశాధికారి రెవరెండ్ కెఆర్ డి వి ప్రసాద్, అత్తాపూర్ రాక్ చర్చి పాస్టర్ రెవరెండ్ కె సుందర్ పాల్, సిస్టర్ స్పందన పాల్ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ సావిత్రీబాయి ఫూలే వర్ధంతి



సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్.



సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న జర్నలిస్టులు, నాయకులు..



సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు ఎం రామేశ్వర్ రావు

**బుద్వేల్, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

చదువుల తల్లి సావిత్రీబాయి పూలే 129వ వర్ధంతి ని పూలే జయంతి ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రాజేంద్రనగర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమం లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్, గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, పూలే ఉత్సవాల కమిటీ నాయకులు కె క్రిష్ణమాచారి, కరణం యాదయ్య ముదిరాజ్, కొండకళ్ల నాగేంధర్ రెడ్డి, వీపీ లలిత్, కె రఘుగౌడ్, కెఎస్ దయానంద్, బొక్క ప్రభాకర్ రెడ్డి , రగడంపల్లి శ్రావణ్, ఎన్ రాధాక్రిష్ణ, డి. సత్యనారాయణ ముదిరాజ్, పెండ్యాల సాయిమల్లిక్. ఎం రామేశ్వర్ రావు, ఎన్ మల్లారెడ్డి, ఎడ్లకాడి సూర్యం, రాజు పహిల్వాన్, పోరెడ్డి ధర్మారెడ్డి, వీర్లపల్లి నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చెరువులను కాపాడితేనే నగరానికి భవిష్యత్తు ఉంటుంది

**పర్యావరణ పరిరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట**

**ఆక్రమణలు తొలగించి, కాలుష్యం నివారించి మూసీ నదిని పునరుద్ధరించుకోవలసిన అవసరం ఉంది**

**పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం**

**కూకట్ పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం)**



హైడ్రా పునరుద్ధరించిన నల్లచెరువు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి కి కూకట్ పల్లి నియోజకవర్గ స్థానిక సమస్యలపై పీసీసీ సభ్యులు, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కూకట్‌పల్లి హైదరాబాద్‌లోని అత్యంత శక్తివంతమైన నియోజకవర్గాలలో ఒకటి, విద్యార్థులు, ఉద్యోగుల జనాభా ఎక్కువగా ఉన్న ప్రధాన విద్యా కేంద్రం, నివాస కేంద్రంగా విస్తృతంగా ప్రసిద్ధి చెందిందని. అదనంగా, వేలాది మంది ప్రయాణికులు కూకట్‌పల్లి నుండి ఐటీ కారిడార్‌కు, ముఖ్యంగా హైటెక్ సిటీకి ప్రతిరోజూ ప్రయాణిస్తారు. ఇది మెరుగైన పౌర మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ అవసరమయ్యే ముఖ్యమైన పట్టణ జోన్‌గా మారుతుంది అన్నారు. కూకట్‌పల్లిలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత నివసిస్తున్నారు. అథ్లెటిక్స్, క్రికెట్, వాలీబాల్, త్రోబాల్, ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టులు, ఫిట్‌నెస్ మౌలిక సదుపాయాలతో కూడిన చక్కటి సముచిత క్రీడా సముదాయాన్నిఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని క్రీడా ప్రతిభను ప్రోత్సహిస్తుందన్నారు. భారీ వర్షాలు, వర్షాకాలంలో కూకట్‌పల్లి, బాలానగర్ ప్రాంతాలలోని అనేక నాలాలు పొంగిపొర్లుతాయి, ఇది సమీప నివాసితులకు తీవ్రమైన ఇబ్బందులు సృష్టిస్తుందని వరదల ప్రమాదాలను కలిగిస్తుందన్నారు. కంచె, చెత్త నివారణ వ్యవస్థలతో పాటు శాశ్వత రసీసీ రిటైనింగ్ గోడల నిర్మాణం వ్యర్థాలను డంపింగ్ చేయకుండా నిరోధించడానికి, పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి, చుట్టుపక్కల ప్రాంతాలను రక్షించడానికి సహాయపడుతుంది అన్నారు. హుస్సేన్ సాగర్ కు దారితీసే దిగువ కనెక్టివిటీ వరకు నాలా డ్రైనేజీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని, సరిగ్గా అభివృద్ధి చేయాలని, ఇది భారీ వర్షాలు, వర్షాకాలంలో సజావుగా నీటి ప్రవాహాన్ని సమర్థవంతమైన విపత్తు నిర్వహణను నిర్ధారిస్తుంది అన్నారు. కూకట్‌పల్లి, హైటెక్ సిటీ మధ్య ప్రయాణించే రోజువారీ ప్రయాణికులు తీవ్రమైన ట్రాఫిక్ రద్దీని ఎదుర్కొంటున్నారు. సిగ్నల్ రహిత కారిడార్‌లను అభివృద్ధి చేయడం, రోడ్డు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రధాన జంక్షన్‌లను మెరుగుపరచడం, ఆధునిక ప్రజా రవాణా వ్యవస్థలను విస్తరించడం వలన ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. వేలాది మంది ఉద్యోగులు, ప్రయాణికులకు కనెక్టివిటీ మెరుగుపడుతుంది అన్నారు. పర్యావరణ స్థిరత్వాన్నిపెంపొందించడానికి, ప్రజా శ్రేయస్సును మెరుగుపరచడానికి, పట్టణ గ్రీన్ పార్కులు, ఎకో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, సరస్సుల చుట్టూ వినోద ప్రదేశాలు, కూకట్‌పల్లిలో అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములను అభివృద్ధి చేయడం వలన నివాసితులకు, ముఖ్యంగా మహిళలు, పిల్లలు, యువత, సీనియర్ సిటిజన్లకు చాలా ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ విషయంలో గతంలో ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ కేటాయించి, ఆ తర్వాత ఆ డిపార్ట్‌మెంట్ స్వాధీనం చేసుకున్న ఉడాసిన్ ముట్ట్‌కు చెందిన భూమిని స్థానిక సమాజ ప్రయోజనం కోసం ఒక పెద్ద పబ్లిక్ ఎకో పార్క్, వినోద గ్రీన్ స్పేస్ అభివృద్ధి కోసం పరిగణించాలని అన్నారు. కూకట్‌పల్లిలో పెద్ద సంఖ్యలో విద్యార్థుల జనాభాను పరిగణనలోకి తీసుకుని, ఆధునిక సాంకేతికతలు, ఉపాధి ఆధారిత శిక్షణ, వ్యవస్థాపకతపై దృష్టి సారించే ప్రభుత్వ మద్దతుతో కూడిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం యువతకు సాధికారత కల్పిస్తుంది, ఉద్యోగ అవకాశాలను పెంచుతుంది అన్నారు. హైదరాబాద్ అభివృద్ధిలో కూకట్‌పల్లి ఎల్లప్పుడూ ముఖ్యమైన పాత్ర పోషించింది. మీ దార్శనిక నాయకత్వంతో ఈ కార్యక్రమాలు మౌలిక సదుపాయాలను గణనీయంగా బలోపేతం చేస్తాయి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తాయి. కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల ప్రజల జీవన నాణ్యతను మెరుగుపరుస్తాయి అన్నారు. అదే విధంగా నల్లచెరువు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసి సీఎం రేవంత్ రెడ్డి కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సీనియర్ నాయకులకు, డివిజన్ అధ్యక్ష్యులకు, మహిళా అధ్యక్షురాళ్లకు, కార్యకర్తలకు, మహిళా సోదరిమనులకు పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.



# ఘనంగా త్యాగరాజ స్వామి ఆరాదోత్సవాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి10(ప్రభాత ఉదయం)**

గద్వాలలో నాయి బ్రాహ్మణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి వారి ఆరాధనా సంగీత ఉత్సవాల్లో భాగం నాయి బ్రహ్మణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో త్యాగరాజ స్వామి చిత్రపటాని ఊరేగించారు గద్వాలలోని టిటిడి కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆరాధన మహోత్సవాలను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా త్యాగరాజుస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం కళాకారుల చేత నాదస్వర కచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు.






# చిన్నారిని ఆశీర్వ దించిన నాయకులు

**కొత్తకోట,మార్చి 10(ప్రభాత ఉదయం)**

మండలంలోని రామ కృష్ణాపూర్ కు చెందిన యం కురుమూర్తి నాయుడు నిర్మలమ్మ దంపతుల కూతురు పుట్టు వెంట్రుకల కార్యక్రమంలో నాయకులు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. ఈ మూలమళ్ళ రాజేశ్వరీ భీమ్ రెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ వనపర్తి రోడ్ నాయకులు మూలమళ్ళ యుగంధర్ రెడ్డి సరస్వతి యం శ్రీనివాసులు సర్పంచ్ మాజీ కోపరేట్టైరెక్టర్ యం చక్రవర్ధన్ రెడ్డి ఎం విక్రమ్ సింహరెడ్డి విహారిక ఉపసర్పంచ్ తాహర్ మాజీ ఉపసర్పంచులు కావలి జగదీష్, సి శివప్రసాద్ ఫీల్డ్ అసిస్టెంట్ సీతమొగులన్న,వార్డు మెంబర్లు ఎండి గఫఫార్, కె మోహన్ బాబు ,మాజీ వార్డు సభ్యులు ఏం భరత్ యాదవ్, సి రాము, ఎండి వహీద్ ,జయరాజు ,బోయ భారతయ్య, బోయ గోపాల్, మధుగం కురుమూర్తి, బండారు మల్లేష్ ,నరేందర్, మారమోని భారతయ రాజశేఖర్, గుజ్జుల శివ తదితరులు పాల్గొన్నారు .

# ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవాలి

**గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ .. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 5కే రన్**

**పటాన్ చెరు, మార్చి 10 (ప్రభాత ఉదయం):**




ఆరోగ్యకరమైన జీవన విధానం అలవర్చుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉండగలరని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ తెలిపారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలో మంగళవారం ఉదయం 5కే రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ప్రారంభమైన 5కే రన్ బొంతపల్లి కమాన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలు రోజువారీ జీవితంలో నడక, వ్యాయామం వంటి అలవాట్లు అలవరుచుకుంటే ఆరోగ్య సమస్యలు దూరమవుతాయని తెలిపారు. శారీరక దృఢత్వం కోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని సూచించారు.ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా యువత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టి క్రీడలు, వ్యాయామం వంటి కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అతిథిగా జెడి శ్రీనివాసరావు, వార్డ్ కౌన్సిలర్ మూడుచింతల నరేందర్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు అధికారులు వివిధ పార్టీల నాయకులు యువకులు తదితరులు పాల్గొన్నారు.




# పాడి రైతుల సంక్షేమానికి కృషి

**గద్వాల జిల్లా ప్రతినిధి,మార్చి10(ప్రభాత ఉదయం)**

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని అందులో భాగంగానే గేదెల కొనుగోలుకు సహకారం అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.

జిల్లా షెడ్యూల్డ్ కులముల సేవా సహకార అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన మినీ డైరీ పథకానికి ఎంపికైన 44 మంది రైతులు గేదెలు కొనుగోలు చేసేందుకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి వెళుతున్న సందర్భంగా మంగళవారం ఐడిఓసి ఆవరణలో వాహనాన్ని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ పథకానికి ఎంపికైన లబ్ధిదారులకు గేదెల కొనుగోలుకు రూ.2 లక్షలకు గాను 60 శాతం ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని, మిగిలిన 40 శాతం బ్యాంకు లోన్ పొందడం జరుగుతుందన్నారు. ఉత్తరప్రదేశ్లోని అయోధ్య సమీపంలో మంచి పాల ఉత్పత్తిని ఇచ్చే గేదెలు ఉండడంతో పాడి రైతులను అక్కడికి పంపిస్తున్నట్లు తెలిపారు. గేదెల కొనుగోలుకు సంబంధిత శాఖల పలువురు అధికారులు కూడా రైతుల వెంట అక్కడికి వెళ్లి సహకరిస్తారన్నారు. రైతులు కొనుగోలు చేసిన గేదెలు జాగ్రత్తగా వారి ఇంటికి చేరేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.ఈ వికార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని నుషిత, పశుసంవర్ధక శాఖ అధికారి శివానంద స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు సంఘాలకు లోన్ ఇచ్చేందుకు లంచం డిమాండ్

**కూకట్‌పల్లిలో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ**

**కూకట్‌పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం)**



పొదుపు సంఘాలకు లోన్లు ఇచ్చి స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహిస్తూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ఏర్పాటు చేసిన సంస్థలో అవినీతి చోటుచేసుకుంది. అధికారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు ఏసీబీ అధికారులు.పట్టణ పేదరిక నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగి.. పేదల నుంచి లంచం వసూలు చేస్తూ పట్టుబడ్డాడు.కూకట్ పల్లి జోనల్ కార్యాలయంలోని మూసాపేట్ సర్కిల్లో ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో అధికారులు దాడులు నిర్వహించారు. మూసాపేట్ సర్కిల్లో అర్బన్ కమ్యూనిటీ డెవలప్మెంట్ (ఖజన) విభాగంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ గా పని చేస్తున్న మురళిని లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి పొదుపు సంఘాలకు వచ్చే రుణాలకు సంబంధించి ఓ గ్రూపు నుంచి లంచం తీసుకుండగా అడ్డంగా దొరికిపోయాడు.ఏసీబీ అధికారులు చెప్పిన వివరాల ప్రకారం.. యూసీడీ పరిధిలో ఓ గ్రూపుకు 20 లక్షల రూపాయల లోన్ ను మంజూరు చేసేందుకు రూ.20వేలు లంచం డిమాండ్ చేశాడు. చివరికి 18 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం ప్రకారం మంగళవారం డబ్బులు చెల్లించాల్సిందిగా సూచించాడు.అధికారి లంచం డిమాండ్ చేస్తున్నట్లు ముందుగానే ఏసీబీని ఆశ్రయించిన బాధితులు.. అధికారులు చెప్పినట్లుగా డబ్బులు చెల్లించారు. ప్లాన్ ప్రకారం నిందితుడు డబ్బులు తీసుకుంటుండగా రైడ్ చేసి రెడ్ హ్యాండెడ్ గ ఆ పట్టుకున్నారు. 18 వేల రూపాయల లంచంతో పట్టుబడటంతో అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.




# పాపిరెడ్డి నగర్‌లో కులసంఘం పేరుతో రోడ్డును కబ్జా చేసి అక్రమ నిర్మాణం

**అడ్డుకోవాలంటూ డీసీ కి వెల్ఫేర్ సభ్యుల ఫిర్యాదు**

**కూకట్ పల్లి, మార్చి 10 (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, కూకట్ పల్లి మండల్, ఆల్విన్ కాలనీ సర్కిల్, వెంకటేశ్వర నగర్ డివిజన్ లోని పాపిరెడ్డి నగర్ రోడ్ నెం.5, బ్లాక్. సిలో రోడ్డు ను యథేచ్ఛగా కబ్జా చేస్తూ కులసంఘం పేరుతో భవనాన్ని నిర్మించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయితే ఆ భవనం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారడం తో బస్తి వాసులు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గతంలో అధికారులకు వినతులు అందించడంతో నిర్మాణం పనులు నిలిచిపోయాయి. ఇటీవల భవన నిర్మాణం పూర్తి చేసుకుని మళ్ళీ మందుబాబులకు అడ్డాగా మారడంతో విషయం తెలుసుకున్న చంద్రారెడ్డి మంగళవారం బస్తి నేతలు, కాలనీ వాసులతో పెద్ద ఎత్తున ఉపకమిషనర్ చాముండేశ్వరిని కలిసి వినతి పత్రాన్ని అందిస్తూ అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేసి బస్తి ప్రజలకు రోడ్డు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బస్తి అధ్యక్షుడు చంద్రారెడ్డి తో పాటుగా నేతలు భగవంత రెడ్డి , కె. వెంకటేష్, ఏ.ప్రభాకర్, పి.శంకర్ రెడ్డి, డి.తిరుపతి రెడ్డి, ఏం.కనకా రెడ్డి, జి.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సమాజ సేవ మా బాధ్యత





**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 10(ప్రభాత ఉదయం)**

పాఠశాల స్థాయి నుండే బాల బాలికల్లో దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, నాయ కత్వం లక్షణాలు పెంపొందించాలనే లక్ష్యంతో పీఎం ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు బి. విష్ణు అధ్యక్షతన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన యూనిట్ మంగళవారం ప్రారంభించారు. ముందుగా స్కౌట్ జెండా ఆవిష్కరించి విద్యార్థులకు బ్యాడ్జ్ , స్కార్ఫ్ ను ధరింపజేశారు. విద్యార్థులు విపత్తులు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను సాహసాలను ప్రదర్శించి అలరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కోశాధికారి రాజగోపాల్ మాట్లాడుతూ భారతదేశంలో స్వచ్ఛంద రాజకీయేతర యూనిఫామ్ ధరించిన అతిపెద్ద యువజన సంస్థ ఈ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అని విద్యార్థుల్లో స్వావలంబన ,సామాజిక స్పృహ మానవీయ దృక్పథం ఆధ్యాత్మిక వికాసం మానసిక చైతన్యం ఉన్నత వ్యక్తిత్వాన్ని పెంపొందించి మంచి పౌరులుగా తీర్చిదిద్దే అంతర్జాతీయ స్వచ్ఛంద విద్య ఉద్యమమే ఈ స్కౌట్స్ అండ్ గైడ్స్ అని పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి విష్ణు మాట్లాడుతూ అభ్యసన ఉన్నత పాఠశాలలో గత సంవత్సరం ఎన్ సిసి యూనిట్ ప్రారంభించుకున్నాం, అదే విధంగా ఈ సంవత్సరం స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ప్రారంభిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఇది పాఠశాల విద్యార్థుల్లో మనుగడ నైపుణ్యాలను, సామాజిక బాధ్యతను పెంపొందించి స్వచ్ఛంద సేవకులుగా సమాజానికి ఉపయోగపడే పౌరులుగా తీర్చిదిద్దడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కోశాధికారి వీ. రాజగోపాల్, అసిస్టెంట్ లీడర్ ట్రైనర్స్ ఎం.రవి కిరణ్ చారి, అమర జ్యోతి, జిల్లా అఫీషియల్స్ వెంకటయ్య, రామకృష్ణ, వెంకట లక్ష్మమ్మ, మరియు జోగులాంబ గద్వాల జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా సెక్రటరీ సతీష్, గైడ్ కెప్టెన్ అరుణతార, పురేందర్, పాఠశాల స్కౌట్ మాస్టర్ ప్రశాంత్ కుమార్, గైడ్ కెప్టెన్ కవిత,గద్వాల జిల్లా స్కౌట్స్ మాస్టర్లు బుడ్డప్ప, యాదయ్య గైడ్ కెప్టెన్లు యాసింబి,రాధిక పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణం కూల్చివేత

**పటాన్ చెరు, మార్చి 10 (ప్రభాత ఉదయం):**

బొల్లారం అన్రిచ్ లేఅవుట్‌లో అక్రమ కట్టడాల కూల్చివేతలు చేపట్టిన అధికారులు పార్కు స్థలం స్వాధీనం చేసుకున్నారు. అమీన్‌పూర్ సర్కిల్-47 పరిధిలోని ఐడిఎ బొల్లారం అన్రిచ్ లేఅవుట్ సర్వే నంబర్లు 81, 84 లో గల పార్కు స్థలాన్ని అధికారులు మంగళవారం అక్రమ కట్టడాలను కూల్చివేశారు. పార్కు స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన గదులను ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కూల్చివేశారు. గతంలోనే ఈ పార్కు స్థలాన్ని సంరక్షించడానికి అధికారులు చుట్టూ కందకాలు తవ్వి, రక్షణ ఏర్పాటు చేశారు. అయితే, కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రభుత్వ చర్యలను అడ్డుకుంటూ పదేపదే కందకాలను పూడ్చివేయడం, రక్షణ కంచెను తొలగించడం చేస్తూ వచ్చారు. దీనిపై స్థానిక పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ, అక్రమార్కులు లెక్కచేయకుండా నిర్మాణాలను యధాతథంగా కొనసాగించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి, పార్కు భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నారు. భవిష్యత్తులో తిరిగి ఆక్రమణలకు గురికాకుండా ఉండటం కోసం, అక్కడ శాశ్వత ప్రహరీ గోడ నిర్మించాలని ఇంజనీరింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.



## బిజెపి కార్యవర్గ సమావేశం నేపథ్యంలో
# సన్నాహక సమావేశం..

**రాజేంద్రనగర్,మార్చి10(ప్రభాత ఉదయం )**

ప్రజల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ చొరవతో పనిచేయడం జరుగుతుందని మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి అన్నారు. కాటేదాన్‌లో జరగనున్న డివిజన్ కార్యవర్గ సమావేశం నిర్వహణకు సంబంధించిన సన్నాహక సమావేశాన్ని బీజేపీ మైలార్దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. రాబోయే డివిజన్ కార్యవర్గ సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈ సమావేశంలో విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ కార్యవర్గ సమావేశానికి ఇన్‌చార్జ్‌గా జోగు రవి కుమార్ వ్యవహరించారు. కార్యక్రమం నిర్వహణ,నాయకులు,కార్యకర్తల సమన్వయం,సమావేశం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు,కార్యాచరణ ప్రణాళిక వంటి విషయాలపై నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. డివిజన్ స్థాయిలో పార్టీ బలోపేతం,బూత్ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను విస్తరించడం,కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం,అలాగే రాబోయే కార్యక్రమాలను విజయవంతం చేయడం గురించి ఈ సమావేశంలో చర్చించారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ నాయకులు,అదికే రాజు,బల్ల శ్రీనివాస్ యాదవ్,అడికే మహేందర్,వల్లూరి శ్రీనివాస్,గూడూరి అంజయ్య,కార్యకర్తలు పాల్గొని సమావేశం విజయవంతం కావాలని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.




ట్రస్ట్ ప్రతినిధులకు విరాళం అందజేస్తున్న సంకూరి జయ ప్రకాష్.

## శ్రీకొండా లక్ష్మణ్ 25 అడుగుల కాంశ్య విగ్రహానికి ఏర్పాటు సంకూరి జయ ప్రకాష్ చేయుత

### బాపూజీ ట్రస్ట్ కు రూ. రూ.1,01,116ల ఆర్థిక సహకారం అందించిన పద్మశాలి నేత

**రాజేంద్రనగర్ , మార్చి 10(ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన మంత్రి పదవిని తృణప్రాయంగా రాజీనామ చేసిన గొప్ప ఉద్యమకారుడు శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అని ది ఇందిరాగాంధీ కో- ఆపరేటీవ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు సంకూరి జయ ప్రకాష్ అన్నారు. ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా పోరాట పటిమ పది కాలాల పాటు చాటే విధంగా ఆ మహానేత 25 అడుగుల కాంశ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. ఎల్.బి.నగర్ పద్మశాలి వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో కొత్త పేట చౌరస్తాలో తెలంగాణ జాతిపితగా బడుగు, బలహీనవర్గాలు భావించే శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఏర్పాటు తనవంతుగా సంకూరి జయ ప్రకాష్ శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఫౌండేషన్ కు మంగళవారం రూ. 1,01,116లు అందజేశారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ ఎల్.బి.నగర్ పద్మశాలి వెల్ఫేర్ ట్రస్టు చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నారాయణగూడలోని రాజమోహళ్ళ పద్మశాలి హస్టల్ స్థాపనతో స్వతంత్ర పోరాట సమయంలోనే ఎందరో చదువుకునేలా సౌకర్యాలు కల్పించిన ఘనత బాపూజీకే దక్కుతుందన్నారు. నేటికి నారాయణగూడ పద్మశాలి హస్టల్ భవనం వద్ద ఉండి చదువుకున్న ఆ నాటి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు దేశ, రాష్ట్ర రాజకీయాలో, ఉన్నత ఉద్యోగాల్లో రాణించి ఆదర్శంగా నిలుస్తున్న విషయాన్ని జయ ప్రకాష్ గుర్త చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పున్న గణేష్, ప్రధానకార్యదర్శ గడ్డం లక్ష్మీనారాయణ, కోశాధికారి జెల్ల జగన్నాథం, వైస్ చైర్మన్ లు కౌకుంట్ల రవితేజ, గుర్రం శ్రవణ్, గుర్రం విశ్వేశ్వర్, పడాల రవీందర్, తలాటి రమేష్, జెల్ల సూర్యకాంత్, కార్యదర్శులు చెరుపల్లి ప్రభాకర్, సంగెపు రమేష్, దోర్నాల చంద్రమౌళి, చిటుపోలు శ్రీనివాస్, కార్యనిర్వాహక కార్యదర్శులు కర్నాటి విజయ్, కస్తూరి శ్రీనివాస్, పొట్టబత్తిని నగేష్, మాకం గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## బొల్లారం గ్లోరియస్ పాఠశాలలో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

**పటాన్ చెరు, మార్చి 10 (ప్రభాత ఉదయం):**

బొల్లారంలోని గ్లోరియస్ పాఠశాలలో నిర్వహించిన "ఫుడ్ ఫెస్టివల్" వినోదాత్మక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. కార్యక్రమానికి బిజెపి పట్టణ అధ్యక్షుడు కె.జె.ఆర్. ఆనంద్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు సిద్ధం చేసిన వివిధ రకాల ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి, వారిని అభినందించారు. అనంతరం ఆనంద్ కృష్ణారెడ్డి ప్రసంగిస్తూ తల్లిదండ్రులకు మరియు విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు:

"నేటి సమాజంలో ఎంతో మంది చదువుకున్న విద్యార్థులు కూడా గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి వ్యసనాలకు బానిసలై తమ జీవితాలను అంధకారం చేసుకుంటున్నారని, ఇది చాలా బాధాకరమైన విషయమని అన్నారు. ఈ సందర్భంగా ఇక్కడకు విచ్చేసిన తల్లిదండ్రులకు విన్నపం చేసారు. తక్కువ వయస్సు ఉన్న మీ పిల్లలకు సెల్ ఫోన్లు మరియు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. చిన్నారులలో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అతిథులను సాదరంగా ఆహ్వానించిన పాఠశాల నిర్వాహకులు సింహాచలం, పాఠశాల సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి,లోకనాథం,ప్రభు కుమార్, శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,కిషోర్ , రామకృష్ణ, నరసింహా రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.







## జోనల్ స్థాయి మార్షల్ ఆర్ట్స్ విజేత కుమారి జాహ్నవి

**వనస్థలిపురం, మార్చి10(ప్రభాత ఉదయం)**

హయత్ నగర్ లోని జెడ్ పీ హెచ్ ఎస్ లో జోనల్ స్థాయి మార్షల్ ఆర్ట్స్ సు అయాన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీలలో హయత్ నగర్, అబ్దుల్లా పూర్ మెట్, మహేశ్వరం, మండలాల మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో 5టి8 క్లాసెస్ , జెడ్ పీ హెచ్ ఎస్ వనస్థలిపురం - హయత్ నగర్ మండలం విద్యార్థి విజేతగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జెడ్ పీ హెచ్ ఎస్ హయత్ నగర్ కు చెందిన ఇందిర , అయాన్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జె. సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## గ్రామంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

**గద్వాల జిల్లా ప్రతినిధి మార్చి 10(ప్రభాత ఉదయం)**

ప్రభాత సమయంలో గట్టు మండలం తుమ్మలచెరువు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సెక్రెటరీ అధ్యక్షతన మంగళవారం విసిపిసి సమావేశం నిర్వహించారు. గ్రామంలో పిల్లల సమస్యలను సమీక్షించడం, మరియు పిల్లలకు ఎలాంటి సమస్య వచ్చినా విసిపిసి ద్వారా పరిష్కార మార్గాలను తీర్చే విధంగా వి సి పి సిఅభివృద్ధి చేయాలని విసిపిసి చైర్మన్, గ్రామ సర్పంచ్ రాజు తెలిపారు. ఎన్ జీఓ నూతన విసిపిసి కమిటీ ఏర్పాటు చేసుకొని గ్రామంలో ఉన్న 18 సంవత్సరాల బాలలకు విద్య, వైద్యం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరలు నిండిన అమ్మాయి, 21 సంవత్సరలు నిండని అబ్బాయిలకు వివాహాలు చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పిల్లలకు గ్రామ సర్పంచ్ రాజు పరీక్ష ప్యాడ్ లు, పెన్నులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్, అంగన్వాడీ కార్యకర్త, పంచాయతీ కార్యదర్శి,విలేజ్ పోలీస్ అధికారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.







## కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, మార్చి 10(ప్రభాత ఉదయం)**

గద్వాల్ పట్టణంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం వెంకంపేట గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక వేసవి శిబిరంలో యాంటీ డ్రగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ చేపట్టి మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల గురించి ప్రజలకు వివరించారు. విద్యార్థినులు మత్తు పదార్థాల వాడకం ఆరోగ్యానికి, కుటుంబానికి, సమాజానికి ఎంత హానికరమో తెలియజేశారు. యువత డ్రగ్స్ వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అవలంబించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో చీూా కోఆర్డినేటర్ బి. జగన్ మోహన్, అధ్యాపకులు ఎం. సమత, సాయి తేజ, విద్యార్థినులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608